## కార్డు దాటని కథ

### నవ్వుల పాలు!

ఆ అమ్మాయి ప్రతి రోజూ అక్కడ బస్సెక్కుతుంది. చదువుకొంటుంది కాలేజీలో హోం సైన్స్. ఆ అమ్మాయి అలా రెండు సంవత్సరాలుగా అక్కడ ఆ బస్సు ఎక్కుతూనే వుంది.

కాని వారం రోజులుగా ఆ అమ్మాయి కంట్లోకి అతనొచ్చి పడ్డాడు.

అతను! ఎంతో బావుంటాడు. చాలా అందంగా వుంటాడు. చక్కగా నవ్వుతాడు. చాలా స్మార్ట్‌గా వుంటాడు.

గత రెండు సంవత్సరాలుగా అలా ఆ అమ్మాయిని ఎవరూ ఆకర్షించలేక పోయారు. చాలామంది చాలా రకాలుగా ప్రయత్నించి విఫలమయ్యారు కూడా!

అతనూ రోజూ అదే టైంకు అక్కడకు వస్తాడు. ఆ అమ్మాయి అక్కడ కనీసం పది నిమిషాలైనా నుంచోవాలి తప్పదు. ఆ పది నిమిషాలూ ఆ అమ్మాయినే చూస్తాడు. కళ్ళు కళ్ళు కలుపుతాడు. చిన్నగా నవ్వుతాడు.

కళ్ళు కళ్ళు కలవగానే అమ్మాయి గుండె ఝల్లు మంటుంది. కాని తిరిగి నవ్వలేక పోతుంది, అదెంత ముందుకు పోతుందో అని-

కాని ఒక్కటి మాత్రం నిజం! అతన్ని చూడందే ఆ అమ్మాయి వుండలేని విధంగా తయారైంది. బస్టాపుకు ఇంకా ముందుగానే రావటం! బస్సు వచ్చినా... నెక్స్టు బస్సుకు పోవటం! ఇలా! అతను ఇదంతా గమనిస్తూనే వున్నాడు. నవ్వుల వర్షం కురిపిస్తూనే వున్నాడు.

ఆ అమ్మాయి అతన్ని గురించి ఆలోచించింది. అతను అందమైనవాడు. ఆడవాళ్ళు కోరుకొనే అంతా అన్నీ - వున్నవాడు - డబ్బు వున్నవాడు - ఉద్యోగ మున్నవాడు...మ్యానర్సూ...ఫోజున్నవాడు...ఇంకేం! ఓ మంచి రోజు చూసి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని ఆ 'మంచి' రోజుకై చూడసాగింది.

ఆ అమ్మాయికై గ్రీన్ సిగ్నలుకై - నవ్వి నవ్వి అతను వారం రోజులు గైరు హాజరయ్యాడు.

ఆ అమ్మాయి నిద్ర మానేసింది. భోజనం కూడా ఒక పూటే చేయసాగింది. 'ఏమైపోయాడు - తన ప్రేమను తెలుపుదామనుకొంటే! తన సర్వస్వం అతనే అని చెప్తామనుకొంటే!! తన రాజు... తన దైవం... తన స్వీట్ హార్ట్... అతనే... అతనే...' అని అందామను కొంటే... 'ఏమైనాడు... ఏమైనాడు...? మూడేళ్ళ నుంచి తనను మురిపిస్తున్న వాడు ఏమైనాడు...?'

ఏమైపోయాడో అనుకొన్న నవ్వుల రాజు...ఆనాడు ప్రత్యక్షమయ్యాడు!

ఎలాగా?

అతను అతని స్కూటర్‌పై, ముందు మూడేళ్ళ పిల్లవాడు, వెనక ఓ చేత్తో అతని నడుం - మరో చేత్తో మూడేళ్ళ పాపాయితో - అతని వైఫ్ 'చింతలు లేని సంసారం' సినిమాకు పోతూ కన్పడ్డారు!

అంతే!

తన జీవితం 'నవ్వుల పాలు' కానందుకు తృప్తిగా నవ్వుకుంది.

- ప్రషాదాచార్య

# జంపన పెద్దిరాజు స్మారక కథలపోటీ

కీర్తిశేషులు జంపన పెద్దిరాజు జ్ఞాపకార్థం జంపన శ్రీగిరిరాజు నిర్వహిస్తున్న కథల పోటీ నిమిత్తం సాంఘిక ప్రయోజనం, సామాజిక చైతన్యం కలిగిన కథలను రచయితల నుంచి ఆహ్వానిస్తున్నారు.

## బహుమతులు

మొదటి బహుమతి - రు. 1000

రెండవ బహుమతి - రు. 500

* మొత్తం రు. 1500 నగదు బహుమతులు నిర్ణయించిన ఈ పోటీకి పంపే రచనల నిడివి 9, 10 ఫుల్‌స్కేప్ పేజీలకు మించరాదు.

* రచయితలు, రచయిత్రులు కథతోపాటు తమ పూర్తి చిరునామాను, రచన దేనికీ అనుకరణ, అనుసరణ, అనువాదం కాదని, అముద్రితమన్న హామీని జత చెయ్యాలి.

* రచనలు తిప్పి పంపడం సాధ్యపడదు.

* బహుమతి పొందిన కథలు రెండింటిని ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1987 సంక్రాంతి సంచికలో ప్రచురిస్తాము.

* బహుమతి పొందిన కథలు కాక, సాధారణ ప్రచురణకు యోగ్యమైన రచనలను ఎంపిక చేసి, వీలువెంట ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ప్రకటిస్తాము.

* శ్రీయుతులు స్మైల్, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ వెల్చేరు నారాయణరావుల సానుభూతి సహకారాలతో నిర్వహిస్తున్న ఈ కథల పోటీకి తుది తీర్పు సంపాదకునిదే. దీనిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం సాధ్యపడదని మనవి.

## గడువు తేదీ

మీ రచనలు మా కార్యాలయానికి చేరవలసిన ఆఖరి తేదీ

31 డిసెంబర్, 1986

- ఎడిటర్

చిరునామా:

జంపన పెద్దిరాజు స్మారక కథల పోటీ,
కేరాఫ్ ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
పోస్ట్‌బాక్స్ నెం: 712,
లబ్బీపేట, విజయవాడ- 520 010.